సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 24 । జనవరి । 2024



సమరానికి సిద్ధం కావాలి

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మనమంతా సిద్ధంగా ఉండాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

- 10లో



వంగ రైతుకు ధరల బెంగ..!

వంగ ధర రైతు నడ్డి విరిచింది. ఎంతో ఆశతో వంగ పంటను సాగుచేసిన రైతన్నలు కుదేలయ్యారు.

- 10లో



ఇండియా బుక్‌ఆఫ్ రికార్డ్స్‌కు చిన్నారి ఎంపిక

- 10లో

పార్వతీపురం పట్టణంలోని జనశక్తి కాలనీకి చెందిన రెండేళ్ల దుర్విత రామన్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది.

న్యూస్‌రీల్

సెల్ టవర్లను పరిశీలించిన పీఓ



పిటిమండలో సెల్‌టవర్ నిర్మాణంపై ఏపీడీని అడిగి తెలుసుకుంటున్న పీఓ విష్ణుచరణ్

జియ్యమ్మవలస: మండలంలోని పి.టి.మండలో నిర్మించిన 4జీ సెల్‌టవర్, కురుపాం మండలంలోని గంగన్నదొరవలసలో నిర్మించిన సెల్‌టవర్‌ను ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మంగళవారం పరిశీలించారు. వాటి పనితీరు, నిర్మాణ నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెలుగు ఏపీడీ సత్యంనాయుడుకు పలు సూచనలు చేశారు. గిరిజనులతో మాట్లాడి సెల్ టవర్ ఉపయోగాలను అడిగితెలుసుకున్నారు. సెల్‌టవర్ ఏర్పాటువల్ల అత్యవసర సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సచివాలయ సేవలతో పాటు పింఛన్లు, రేషన్ పంపిణీ వేగవంతమైందని తెలిపారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న డీఆర్వో వెంకటరావు, తదితరులు

పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ టైపిస్టులు, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులకు డీఆర్వో శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘ పూర్వపు శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పి.మణి ప్రభాకరరావు, అదనపు కార్యదర్శి ఎ.ధర్మారావు, నాయకులు జి.శ్రీరామమూర్తి, ఆర్.ఉమామహేశ్వరరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

3,039 మందికి వైద్య సేవలు



పార్వతీపురంటౌన్: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన జేఏఎస్ శిబిరాల్లో 3,039 మందికి వైద్యసేవలు అందించామన్నారు.

మంగళవారం అందించిన వైద్యసేవలు

మండలాలు -15, వైద్యశిబిరాలు-6
మొత్తం ఓపీలు-3,039
స్పెషలిస్టుల ఓపీలు-1387
పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఓపీలు -1652
డీఎం-294, హెచ్‌టీఎన్-531
ఏఎన్‌సీ-81, పీఎన్‌సీ-46,
అనీమియా-26, ల్యాబ్‌టెస్టులు -2218
ఈసీజీ పరీక్షలు -52, కంటి పరీక్షలు-217
రిఫరల్ కేసులు-9

రైస్ మిల్లుపై ఏనుగుల దాడి

- 25 బస్తాల ధాన్యం ధ్వంసం



ఏనుగుల దాడితో చెల్లాచెదురైన ధాన్యం బస్తాలు

భామిని: భామిని మండలం తాలాడ ఐలమ్మ తోటలో తిష్టవేసిన ఏనుగుల గుంపు రోడ్లపైకి చేరి నష్టం చేకూర్చుతున్నాయి. భామిని మండలం పాత ఘనసర-ఘనసర కాలనీల మధ్య ఉన్న రైస్ మిల్లుపై సోమవారం రాత్రి దాడిచేశాయి. మిల్లు ఆవరణలో దించేందుకు ట్రాక్టర్‌పై ఉన్న 25 ధాన్యం బస్తాలను చెల్లాచెదురుగా విసిరేశాయి. దీంతో మిల్లుయజమాని లబోదిబోమంటున్నాడు. ఆదుకోవాలంటూ అటవీశాఖ అధికారులను వేడుకుంటున్నాడు.

కళ్లికోటకు చేరుకున్న గజరాజుల గుంపు

కొమరాడ: మండలంలోని కుమ్మరిగుంట, గంగారేగువలస, తదితర గ్రామాల్లో సంచరించిన మరో గజరాజుల గుంపు మంగళవారం వేకువజామున రైల్వే ట్రాక్ దాటి కళ్లికోట, దుగ్గి పరిసర ప్రాంతాలకు తరలివెళ్లాయి. అర్ధాం నుంచి కళ్లికోట, దుగ్గి రోడ్డుపై వెళ్లేవారు అప్రమంతా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు.

పోలమాంబ
పాహిమాం!!

- అంబరాన్నంటిన 'శంబర'ం
- కనుల పండువగా శంబర పోలమాంబ సిరిమానోత్సవం
- తరలివచ్చిన భక్తజనం
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సీఎం రాజన్నదొర
- అధికార యంత్రాంగం కృషితో సజావుగా సాగిన జాతర





శంబర పోలమాంబ సిరిమానోత్సవ సందడి, (ఇన్‌సెట్లో) శంబర పోలమాంబ అమ్మవారు

మక్కువ: మంగళ వాయిద్యాలు.. భక్తుల జయ జయ ధ్వానాలు.. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. సిరిమాను పూజారి రూపంలో అమ్మవారు మక్కువ మండలంలోని శంబర వీధుల్లోకి అరుదెంచిన వేళ భక్తులు పులకించిపోయారు. పోలమాంబ పాహిమాం!!.. చల్లంగ చూడమ్మా.. పోలమాంబమ్మా.. అంటూ ప్రార్థించారు. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన లక్షలాది మంది భక్తులతో శంబర గ్రామం జనసంద్రంగా మారింది. రాష్ట్రంలోని నలుమూలలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. గోముఖినదిలో పుణ్యస్నానాలాచరించి అమ్మవారిని దర్శించారు. మొక్కుబడులు చెల్లించారు.

సిరిమానోత్సవం సాగిందిలా..

మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సిరిమానోత్సవాన్ని ప్రారంభించాలని అధికారులు భావించారు. అయితే, ఘటాలను తీసుకురావడంలో ఆలస్యం కావడంతో మధ్యాహ్నం 4.35 నిమిషాలకు పూజారి జన్ని పేకాపు భాస్కరరావు, అలియాస్ జగదీశ్వరరావు సిరిమానును అధిరోహించారు. దీంతో ఏటా నిర్వహించిన సమయంకన్నా, సుమారు గంట సమయం ఆలస్యంగా ఉత్సవం ప్రారంభమైంది. ఆనవాయితీ ప్రకారం ముందుగా గిరడ, ఆ తరువాత మునసబు, కరణం కుటుంబాల వారు పూజలు చేశారు. అక్కడ నుంచి పనుకువీధి, గొల్లవీధి, జన్నివీధుల మీదుగా సాయంత్రం 5.42 నిమిషాలకు సిరిమాను ప్రధానాలయం సమీపంలోకి చేరుకుంది.

సంప్రదాయబద్ధంగా ఘటాలకు పూజలు

ముందుగా జన్నివారి ఇంటి నుంచి ఘటాలను అమ్మవారి ఆలయంలోకి తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం సిరిమాను ఉండే ప్రదేశానికి తీసుకెళ్లారు. ప్రధానాలయం నుంచి అమ్మవారు వచ్చే మార్గంలో నేలపై చీరలను పరిచి వాటిపై చిన్నారులను పడుకోబెట్టగా.. వారిపైనుంచి అమ్మవారి ఘటాలను దాటించారు. జన్నివారి ఇంటి నుంచి అమ్మవారి ఘటాలను గిరడ వారింటికి, ఆ తరువాత మునసబు, కరణం ఇళ్లకు తీసుకెళ్లి పూజలు చేశారు. మంగళవారం రాత్రంతా అమ్మవారి ఘటాలను గ్రామంలో తిరువీధి చేసి, బుధవారం ఉదయం 10 గంటల సమయానికి ప్రధాన రహదారి వద్ద అమ్మవారి గద్దెకు చేర్చుతారు. అక్కడ అమ్మవారి ఘటాలకు ఉయ్యాలకంబాలు కార్యక్రమం నిర్వహిస్తారు. అనుపోత్సవం కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ఘటాలను వనంగుడికి తీసుకువెళ్తారు.



అమ్మవారి ఘటాలను తీసుకొస్తున్న భక్తులు



సిరిమానోత్సవానికి తరలి వస్తున్న భక్తులు

అమ్మవారి సేవలో నేతలు

అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర సమర్పించగా, ఆలయ అధికారులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, జేసీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ షావు మురళీకృష్ణ, సాలూరు ఏఎంసీ చైర్మన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు.

తగ్గిన భక్తుల రద్దీ

గతేడాది రెండులక్షల మందికిపైగా భక్తులు అమ్మవారి జాతరను తిలకించేందుకు రాగా, ఈ ఏడాది మాత్రం అధికారుల అంచనాలను తలకిందులు చేస్తూ భక్తుల తాకిడి తగ్గింది. పది వారాల వరకు అమ్మవారి జాతర నిర్వహిస్తున్నట్టు దేవదాయశాఖ ప్రచారం చేయడం, తొలివారం భక్తుల రద్దీ ఉంటుందని, పిల్లలతో వెళ్లడం క్షేమకరం కాదని చాలామంది భక్తులు అమ్మవారి దర్శనాన్ని వాయిదా వేసుకున్నట్టు అధికారులు భావిస్తున్నారు. వేకువజాము నుంచి ఉదయం 11 గంటల వరకు భక్తుల తాకిడి తక్కువగా కనిపించింది. ఆపై ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో శంబర గ్రామం కిటకిటలాడింది. గ్రామంలోని రహదారులన్నీ రద్దీగా మారాయి.



తప్పిపోయిన చిన్నారుల అప్పగింత



తప్పిపోయిన బాలుడిని తండ్రి పాపారావుకు అప్పగిస్తున్న ఎస్‌ఐ నరసింహమూర్తి

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను పోలీసులు వారివారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మండలంలోని బట్టివలస గ్రామానికి చెందిన అడ్డాకుల ధనుష్ అనే బాలుడు తప్పిపోవడంతో పోలీసులు ఆరా తీసి గ్రామానికి తీసుకెళ్లి బాలుడు తండ్రి పాపారావుకు అప్పగించారు. అలాగే, పాచిపెంట మండలానికి చెందిన బాలుడు ఎల్.షన్ముఖ, మరో ముగ్గురు చిన్నారులు, వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్‌ఐ నరసింహమూర్తి తెలిపారు.



గోముఖి నదీతీరంలో భక్తజన సందోహం

ఫలించిన అధికారుల కృషి..

గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అధికారులు సమన్వయంతో పనిచేసి క్యూలైన్లు ఏర్పాటు, బస్సుల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలు పక్కాగా అమలు చేయడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్, అడిషనల్ ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సునిల్‌షోరెన్, ఆర్డీఓ హేమలత, డీఎస్పీలు మురళీధర్, కృష్ణ, దిశ డీఎస్పీ హర్షిత ఎప్పటికప్పుడు జాతరను పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలిచ్చారు. క్యూ కాంప్లెక్స్‌ల సమీపంలోనే తలనీలాలు సమర్పించే శిబిరం, అక్కడకు సమీపంలోనే వేటలు వేసి మొక్కులు తీర్చుకొనే ప్రదేశాన్ని కేటాయించడం భక్తులకు కలిసొచ్చింది. ఎస్పీ పర్యవేక్షణలో 700 మంది పోలీసులు విధులు నిర్వహించారు. డ్రోన్ కెమారాతో పాటు, 41 చోట్ల సీసీ కెమెరాలు అమర్చి జాతరను పర్యవేక్షించారు. సిరిమాను వద్ద రోప్‌పార్టీ భక్తుల తోపులాటలు జరగకుండా నివారించారు. జిల్లా దేవదాయశాఖ అధికారి డి.వి.వి ప్రసాదరావు, ఈఓ వి.వి.సూర్యనారాయణ, సాలూరు సీఐ ధనంజయరావు ఎప్పటికప్పుడు భక్తులకు సూచనలిచ్చారు. పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఆర్టీసీ డిపోల నుంచి 150 బస్సులను ఆర్టీసీ నడిపింది. ఆర్టీసీ సీఎంఈ శ్రీనివాసరావు, డీపీటీఓ అప్పలనారాయణ బస్సు సర్వీసులను పర్యవేక్షించారు.



అమ్మవారి దర్శనానికి వచ్చిన జేసీ గోవిందరావు దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



అమ్మదర్శనానికి శంబర చేరుకున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



జాతరను సమీక్షిస్తున్న అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, ఆర్డీఓ హేమలత



తలనీలాలు సమర్పించుకుంటున్న చిన్నారి

1,83,077 మంది డ్వాక్రా సభ్యులకు..
రూ.94.33 కోట్ల ఆసరా



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి
- సంక్షేమ పథకాలతో ఆర్థిక అండ
- వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు
- జిల్లాలో నాలుగు విడతల్లో రూ.378.39 కోట్ల లబ్ధి

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: హామీ ఇస్తే నెరవేర్చడం.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుంటారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన డ్వాక్రా రుణాలు మాఫీ హామీని తంచన్‌గా నెరవేర్చారు. వైఎస్సార్ ఆసరా కింద చివరి విడత నిధులను అనంతపురం జిల్లా ఉరవకొండ వేదికగా మంగళవారం విడుదల చేశారు. వర్చువల్ విధానంలో సాగిన కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ నిషాంత్‌కుమార్, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, లబ్ధిదారులు తిలకించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయనగరం జిల్లాలోని వైఎస్సార్ ఆసరా కింద నాల్గవ విడతలో జిల్లాలో 16,669 స్వయం సహాయక సంఘాలకు చెందిన 1,83,077 మంది సభ్యులకు రూ.94.33 కోట్లు ఆసరా నిధులు జమ చేశారన్నారు. నాలుగు విడతల్లో జిల్లాల్లోని డ్వాక్రా మహిళలకు రూ.378.39 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. నాల్గవ విడతలో కురుపాం నియోజకవర్గంలో 4,136 సంఘాలకు రూ.21.07 కోట్లు, పాలకొండలో 4,508 సంఘాలకు రూ.25.54 కోట్లు, పార్వతీపురంలో 4,436 సంఘాలకు రూ.20.54 కోట్లు, సాలూరులో 3,589 సంఘాలకు రూ.11.60 కోట్లు, మెప్మా పరిధిలో 2,268 సంఘాలకు రూ.15.53 కోట్ల ఆర్థిక లబ్ధికలిగిందన్నారు.

ఆర్థిక భరోసా



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా కలిగింది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో తిరిగి చెల్లించినందుకు చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతో వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నాం.

–గుంట్రెడ్డి లక్ష్మి, పార్వతీపురం

మహిళా సంక్షేమానికి పెద్దపీట



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళల రుణాలు మొత్తం మాఫీ చేశారు. మా సంఘానికి మూడు విడతల్లో రూ.3,36,000 లబ్ధి కలిగింది. నాలుగో విడతలో నిధులు జమకానున్నాయి. ఈ స్థాయిలో ఆర్థిక ప్రయోజనం కల్పించిన ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదు. వచ్చే ఎన్నికల్లో ఆయనను గెలిపించుకుంటాం.

– సూరిపిల్లి వరలక్ష్మి, శ్రీహనుమాన్ ఎస్‌హెచ్‌జీ గ్రూపు, సీతానగరం

జగనన్నకు రుణపడి ఉంటాం



జగనన్నకు రుణపడి ఉంటాం. ఆసరా పథకంతో మాకు ఆర్థిక పరమైన ఇబ్బందులు తీరాయి. మా తబిత సంఘానికి ఒక్కో విడతలో రూ.84 వేలు రుణమాఫీ డబ్బులు జమయ్యాయి.

– ఎస్.సరోజిని, రాజన్నగూడ, సీతంపేట మండలం

ప్రతీ విడతలో రూ.7,257 చొప్పన లబ్ధి



మా శివశక్తి పొదుపు గ్రూపులోని ప్రతి సభ్యురాలికి ప్రతీ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.7,257 చొప్పున ఆర్థిక ప్రయోజనం కలిగింది. నాలుగు విడతల్లో ఒక్కో లబ్ధిదారుకు రూ.29,028 ఆర్థిక ప్రయోజనం కలిగింది. మరోవైపు వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750లు అందిస్తున్నారు. పిల్లల చదువులకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన, జగనన్న విద్యాకానుకల రూపంలో సహకరిస్తున్నారు. పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదరించిన జగనన్న రుణం తీర్చుకుంటాను.

– కె.కృష్ణవేణి, శివశక్తి గ్రూపు, సీతానగరం


ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ మహిళాభివృద్ధితో దేశం అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. అనంతరం వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వారం రోజుల పాటు ఆసరా సంబరాలు

జిల్లాలో బుధవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు వారం రోజులపాటు జిల్లా వ్యాప్తంగా నియోజక వర్గ, మండల స్థాయిల్లో ఆసరా సంబరాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. నియోజవర్గ స్థాయిలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో సంబరాలు జరుగుతాయన్నారు.

సెస్ వసూలు తప్పనిసరి

- జేసీ ఆర్.గోవిందరావు



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: ప్రభుత్వ, ప్రైవేటు భవన నిర్మాణ యజమానుల నుంచి విధిగా సెస్ వసూలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం భవన, ఇతర నిర్మాణాల కార్మికుల సంక్షేమ సెస్ వసూలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు మార్కెట్ విలువ ప్రకారం ఒక్కశాతం సెస్‌ను విధిగా చెల్లించాలని స్పష్టం చేశారు. కార్మికశాఖకు ఆన్‌లైన్, చలానా రూపంలో సెస్ చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. కార్మికశాఖ అధికారులు ఈ విషయాన్ని భవన నిర్మాణాలు ప్రారంభించే సమయంలోనే యజమానులకు అవగాహన కల్పించి సెస్‌ను వసూలు చేయాలని సూచించారు. వసూలు చేసిన సెస్‌ను కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్‌శాఖ, పురపాలక సంఘాలు, పారిశ్రామిక శాఖ, జిల్లా పరిషత్ తదితర శాఖలు వసూలు చేసిన సెస్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి కార్మికశాఖాధికారి ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పనులు చేస్తున్న శాఖలు ప్రతి కార్మికశాఖకు నివేదికలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కె.రామకృష్ణరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీ సత్యనారాయణ, పే అండ్ అకౌంట్స్ అధికారి పి.చంద్రశేఖరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, డీపీఓ బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


తవిటినాయుడు మృతదేహం

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామానికి చెందిన మరడాన తవిటినాయుడు (50) మంగళవారం వేకువ జామున గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాలప్డాడు. మద్యానికి బానిసైన తవిటినాయుడిని నిత్యం మద్యం తాగితే ఎలా అని భార్య ప్రశ్నించడంతో మనస్తాపానికి గురై పంటలకు వినియోగించగా ఇంట్లో మిగిలి ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక హెచ్‌సీ ఎన్.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట గ్రామ శివారులో ఎస్సై జ్ఞానప్రసాద్ సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు చేసి 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మంగళవారం మాట్లాడుతూ ఆరికతోట పరిసరాల్లో సారా తయారువుతోందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. సారాతయారీ కోసం సిద్ధం చేసి భూమిలో పాతిపెట్టి ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామని చెప్పారు.

ఆకట్టుకున్న చిత్రలేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ఈ నెల 29న జరిగే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం స్ఫూర్తిని తెలిపేందుకు స్థానిక కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలు ఆకట్టుకున్నాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 100 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. పోటీల అనంతరం న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ఐదు మంచి చిత్రలేఖనాలకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పంపిన పుస్తకాలను, ప్రశంసా పత్రాలు బహుమతులను విద్యాలయం ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ అందజేశారు.

సైబర్ యాక్ట్ కింద కేసు నమోదు

విజయనగరం క్రైమ్: వాట్సాప్‌లో పార్ట్ టైమ్ జాబ్స్‌కు సంబంధించి వచ్చిన మెసెజ్‌కి స్పందించి రూ. 37 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం ఫిర్యాదు చేయగా సైబర్ యాక్ట్ కింద కేసు నమోదైంది. ఈ ఫిర్యాదు వివరాలిలా ఉన్నాయి. కంటోన్మెంట్ ప్రాంతంలో నివాసం ఉంటున్న సురేష్‌బాబు ఇన్సూరెన్స్ అడ్వయిజర్‌గా పనిచేస్తున్నాడు. పార్ట్ టైమ్ జాబ్స్ ఉన్నాయని వాట్సాప్‌లో మెసెజ్ రావడంతో తన వివరాలు అప్‌లోడ్ చేశాడు. అటునుంచి వచ్చిన ప్రతి టాస్క్‌ను పూర్తిచేసుకుంటూ వచ్చాడు. రూ.100 కడితే రూ.150 వచ్చింది. అలా రూ.2వేల వరకూ తన ఖాతాలో జమ చేసుకున్నాడు. తర్వాత ప్రీపెయిడ్ టాస్కులు పెట్టడంతో రూ.10కి పది వస్తుందని చెప్పడంతో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడం ప్రారంభించాడు. తన అకౌంట్‌లోకి లక్షలు వచ్చినట్లు కనబడుతుంటాయి. కానీ అవి తీసుకోవాలంటే వేలకువేలు కట్టాలనే నిబంధన ప్రకారం దపదఫాలుగా రూ.37 లక్షలు కట్టేశాడు. చివరకూ మోసపోయానని గ్రహించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సైబర్ యాక్ట్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టంపాడులో అధికారుల పర్యటన


చిట్టంపాడులో పర్యటిస్తున్న అధికారుల బృందం

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో చిట్టంపాడు గ్రామంలో అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. గ్రామానికి చెందిన ఏడాదిన్నర బాలుడు జన్ని శ్రావణ్ సోమవారం చనిపోయిన ఉదంతం పత్రికల్లో ప్రచురితం కావడంతో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు మంగళవారం బాలల హక్కుల కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు, డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్‌దొర, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి భాస్కరరావు, జిల్లా మలేరియా అధికారిణి వై.మణి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శేషుబాబు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి బంగారునాయుడు తదితరులు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మృతుడి తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు. డీఎంహెచ్‌ఓ భాస్కరరావు పర్యవేక్షణలో గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పలు పత్రికల్లో అంబులెన్స్ సదుపాయం కల్పించలేదని, వైద్యసేవలందించలేదన్న వార్తల్లో వాస్తవం లేదన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

సమరానికి సిద్ధం కావాలి

- భీమిలి సమావేశాన్ని విజయవంతం చేయాలి
- జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాస రావు పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రాజాం: ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మనమంతా సిద్ధంగా ఉండాలని, ఈ మేరకు ఈనెల 27న విశాఖ జిల్లా భీమిలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న సమరానికి సిద్ధం అనే ఉత్తరాంధ్ర సభను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అధ్యక్షతన మంగళవారం రాజాంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ వద్ద రాజాం మున్సిపాల్టీతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికల సమరానికి రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమావేశాలను నిర్వహిస్తున్నారని వెల్లడించారు. అందులో భాగంగా ఉత్తరాంధ్రలో తొలి సభ జరుగుతుందన్నారు. 34 నియోజకవర్గాల్లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌తో ఈ సమావేశం జరుగుతుండగా, 2 లక్షల మంది హాజరవుతారని అంచనాలు ఉన్నాయని, మన నియోజకవర్గం నుంచి కూడా పెద్ద ఎత్తున సమావేశానికి హాజరు కావాలని కోరారు. పార్టీ క్యాడర్‌తో సీఎం నేరుగా మాట్లాడతారని తెలిపారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయని, పార్టీ నిలబెడుతున్న అభ్యర్థి వెంటే మనమంతా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ కుటుంబం వెంటే రాజాం నియోజకవర్గం ఉందని పేర్కొన్నారు. ఇక్కడ ఇన్‌చార్జ్‌గా నియమితుడైన డాక్టర్ తలే రాజేష్‌ను భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని, ఇక్కడ సామాజిక యాత్రను ఎంత విజయవంతం చేశారో అంతే స్థాయిలో భీమిలి వద్ద జరిగే సమరానికి సిద్ధం సభను విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఆర్‌పీసీలో టీడీపీ అభ్యర్థి..

రాజాం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మార్పుపై టీడీపీ కార్యకర్తలు కుప్పిగంతులు వేస్తున్నారని, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు ఉండగా ఇంతవరకూ ఇక్కడ టీడీపీ టికెట్ ఎవరికి ఇస్తారో తెలియని పరిస్థితి ఉందని ఎద్దేవచేశారు. ప్రస్తుతం ఉన్న టీడీపీ ఇన్‌చార్జ్ ఆర్‌పీసీలో మాత్రమే ఉన్నారని, ఆయనకు టికెట్ ఇంతవరకూ ఆ పార్టీ ప్రకటించలేదని, అటువంటి వ్యక్తులు కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సిగ్గుగా ఉందన్నారు.

మంచి నాయకత్వం..

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో బలమైన నాయకత్వం ఉందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. రాజాంలో పార్టీ ఎమ్మెల్యే గెలుపు నల్లేరుమీద నడకేనని, పార్టీ కార్యకర్తలు అంతా కష్టపడి పనిచేస్తే గతంలో వచ్చిన మెజార్టీ కంటే రెండింతలు మెజార్టీ పార్టీకి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

వైద్యునిగా ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్న తాను సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో పార్టీలోకి వచ్చానని పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. తనను నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలతో పాటు సీఎం గుర్తించి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, పులిరాజు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, వావిలపల్లి జగన్మోహనరావు, గురుగుబెల్లి స్వామినాయుడు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, యాలాల వెంకటేష్, నక్క వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

వంగ రైతుకు ధరల బెంగ..!


రామభద్రపురం కూరగాయల మార్కెట్‌లో కొనుగోలు దారుల కోసం ఎదురు చూస్తున్న వంగ రైతులు

- పడిపోయిన ధర
- కిలో రూ.2 నుంచి రూ.3
- మార్కెట్‌లో గిట్టుబాటు కరువు
- కుదేలవుతున్న రైతాంగం

రామభద్రపురం: వంగ ధర రైతు నడ్డి విరిచింది. ఎంతో ఆశతో వంగ పంటను సాగుచేసిన రైతన్నలు కుదేలయ్యారు. రామభద్రపురం కూరగాయల మార్కెట్‌లో సుమారు 20 కిలోలు ఉన్న క్రేట్ వంగ కాయల ధర రూ.50 నుంచి రూ.60 పలుకుతోంది. అదీ కొనేవాడు లేక రైతన్నలు కొనుగోలు చేయాలని దళారులను బతిమాలుకుంటున్న పరిస్థితి ఉంది. రిటైల్ మార్కెట్‌లో వినియోగదారులకు రూ.15 నుంచి రూ.20 వరకు పలుకుతున్న వంగ ధర అదే రైతులు విక్రయించేసరికి రూ.2 నుంచి రూ.3లకు కూడా కొనేవారు కరువయ్యారు. గతేడాది వంగ సాగుతో లాభాలు కళ్ల చూసిన రైతులు ఈఏడాది జిల్లా వ్యాప్తంగా 150 ఎకరాలలో సాగు చేయగా రామభద్రపురం మండలంలో సుమారు 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

కొనుగోలు దారులను బతిమాలుతున్నాం



మాది మెంటాడ మండలం కుంటినవలస. ఎకరా విస్తీర్ణంలో వంగ పంట సాగుచేస్తున్నాను. ఇప్పటి వరకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. వారానికి రెండుసార్లు పురుగు మందు పిచికారీ చేయడానికి రూ.4వేల వరకు ఖర్చవుతుంది. కొద్దో గొప్పో వంకాయలు దొరుకుతున్నాయన్న సమయానికి ధర పూర్తిగా కుదేలైంది. ఆరుక్రేట్‌లతో తీసుకొచ్చిన వంకాయలు వ్యాపారులను బతిమాలి ఒక్కో క్రేట్ రూ.50 చొప్పున విక్రయించాను. కిలో ధర రూ.2.50 పడింది. ఇంతగా వంగధర కుదేలవడం ఇదే మొదటి సారి. పరిస్థితి ఇలాగే కొనసాగితే పూర్తిగా నష్టాలపాలవుతాం

– మాదిరెడ్డి లక్ష్మి, వంగ రైతు, కుంటినవలస

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- గాజులరేగకు చెందిన 50 కుటుంబాలకు పార్టీ తీర్థం
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన డిప్యూటీ స్పీకర్

విజయనగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి అవకాశం కల్పిస్తే విజయనగరాన్ని సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని ఏపీ శాసన సభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నగరంలోని గాజులరేగ ప్రాంతానికి చెందిన 50 కుటుంబాల వారు జనసేన పార్టీని వీడి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ కోలగట్ల వీరభద్రస్వామి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

పార్టీలో చేరిన వారికి స్వాగతం

అంతకుముందు గాజులరేగ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై జనసేన పార్టీకి


నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. పార్టీలో చేరిన వారందరికీ మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నామన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా ప్రజాసేవ చేయడమే తన అభిమతమని పేర్కొన్నారు. 2019 ఎన్నికల అనంతరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చానని చెప్పారు. గాజులరేగ ప్రాంతంలో రహదారులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, వాటర్ ట్యాంక్ నిర్మాణంతో పాటు పైప్‌లైన్ ఏర్పాటు పనులు కూడా ముమ్మరంగా చేపట్టామన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ కలిసి పోటీ చేస్తున్నాయని అయితే ఆ నాయకులు ఎవరో బంగ్లా నేతలకు తెలియదని ఎద్దేవా చేశారు. వెలుతురు వస్తే తెల్లారిందని, చీకటి పడితే రాత్రియిందని ఎలా తెలుస్తుందో..అశోక్‌గజపతిరాజు బంగ్లా నుంచి కాలు బయటకు పెడితే ఎన్నికలు వచ్చాయన్న విషయం విజయనగరం ప్రజలందరూ ఎరిగిన సత్యమని పేర్కొన్నారు. మరోసారి తనను శాసనసభ్యుడిగా గెలిపించాలని, సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని మాట ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని భరోసా ఇచ్చారు. పెద్ద చెరువును అభివృద్ధి చేసి బోటు షికారు ఏర్పాటు చేస్తానని తెలిపారు. లంచగొండితనం లేకుండా సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, సీనియర్ కార్పొరేటర్ కేదారిశెట్టి సీతారామమూర్తి, యువజన విభాగం అధ్యక్షుడు అల్లు చాణక్య, కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ, పార్టీ నాయకులు కనుగుల రాజా, జమ్మాన శ్రీనివాస్, గార సత్యనారాయణ, బోడసింగి ఈశ్వరరావు, జమ్ము మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న టిప్పర్

- నేలకొరిగిన 13 స్తంభాలు
- ఐదు గ్రామాల్లో అలుముకున్న చీకట్లు


టిప్పర్ ఢీకొనడంతో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

మెంటాడ: మండలంలో నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనుల్లో భాగంగా మెటీరియల్‌ను తీసుకువెళ్తున్న టిప్పర్‌కు మంగళవారం తెల్లవారుజామున విద్యుత్‌వైర్ తగలడంతో ఆగకుండా చాలా దూరం వెళ్లిపోగా వరుసగా 13స్తంభాలు నేలకొరిగాయని విద్యుత్‌శాఖ ఏఈ తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒక్కసారిగా 13 స్తంభాలు నేలకొరగడంవల్ల సారాడవలస, మల్లేడవలస, సంగం గుడ్డివలస, శిగడంవలస, కిందగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయిందని తెలిపారు. అయితే విద్యుత్ సరఫరా పనులు పునరుద్ధరణ జోరుగా చేయనున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రానికి ఈఐదు గ్రామాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మన్ మృతి


జూనియర్ లైన్‌మన్ మృతదేహం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గుషిణి గ్రామ పంచాయతీ బర్లపేట పంటపొలాల్లో విద్యుత్ ఘాతానికి గురై జూనియర్ లైన్‌మన్ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రామగణేష్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జామి గ్రామంలోని కొత్తవీధికి చెందిన రెడ్డి కోటరావు(27) గడిచిన రెండేళ్లగా గుషిణి సచివాలయం పరిధిలో గ్రేడ్-2 సచివాలయ జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం ఉదయం బర్లపేట సమీపంలో ఉన్న పంట పొలాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ వైర్లు కలిపేందుకు పోల్ ఎక్కగా..11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో షాక్ కొట్టి స్తంభంపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎల్‌సీ తీసుకోవడంలో పొరపాటు జరగడంతో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనాస్థలికి వెళ్లి కుమారుడి మృతదేహాన్ని చూసి తీవ్రంగా రోదించారు. చేతికి అందివచ్చిన కొడుకు అర్ధాంతరంగా మృతిచెందడంతో శోకసంద్రంలో మునిగిపోయారు. ఏఈ పిచ్చయ్య అందించిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామగణేష్ తెలిపారు.

కొండపై నుండి జారిపడి యువకుడు


మురళి మృతదేహం

పాచిపెంట: ఫొటోలు తీసుకునే క్రమంలో బీపీ డౌన్ అయి ప్రమాదవశాత్తు కొండపై నుంచి కిందకు జారిపడి ఓ యువకుడు మృతిచెందాడు. పాచిపెంట మండలంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చీపురువలస సమీపంలో పారమ్మకొండ మీదకు సాలూరు మండలం కూర్మరాజుపేటకు చెందిన అప్పికొండ మురళి (18), అదే గ్రామానికి చెందిన మేనల్లుడు గణేష్ ఎక్కారు. అక్కడ దేవుడిని దర్శించుకున్న తరువాత మురళి ఫోన్‌లో ఫొటోలు తీయమని గణేష్‌కు చెప్పి కొండ చివరలో నిల్చున్నాడు. అయితే మురళికి లో బీపీ ఉండడం వల్ల కళ్లు తిరిగి, కింద కు జారిపడి మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ చెస్ పురుషుల జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ

విజయనగరం అర్బన్: తిరుచురాపల్లి భారతీదాసన్ యూనివర్సిటీలో ఈ ఏడాది 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ పురుషుల విభాగంలో పాల్గొనే జట్టును జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ విడుదల చేసింది. ఈ మేరకు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల యూనివర్సిటీ అనుబంధ కళాశాల చైతన్య ఇంజినీరింగ్ కాలేజ్ కొమ్మాది విశాఖ క్రీడామైదానంలో జరిగిన జరిగిన సౌత్ జోన్ ఇంటన్ యూనివర్సిటీ చెస్ పురుషుల జట్టు ఎంపిక పోటీలో ప్రతిభ చూపిన జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాల క్రీడాకారులు జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. జట్టుకు ఎంపికై న వారిలో పి.రాకేష్ (విజ్ఞాన్ కాలేజ్, విశాఖ), టి.గణేష్ కుమార్ (రఘు ఇంజినీరింగ్ కాలేజ్ ఎ, విశాఖ), పి.డింపుల్ హనీషా (గొన్నా కాలేజ్ అనకాపల్లి), ఎస్.చరణ్ (విజ్ఞాన్ కాలేజ్, విశాఖ), కె.సతీష్‌కుమార్, డి.శ్యామంత్ (గొన్నా కాలేజ్, అనకాపల్లి) ఉన్నారు. జట్టు సభ్యులకు క్రీడాదుస్తులను యూనివర్సిటీ యాజమాన్యం ఇచ్చి ప్రోత్సహించింది. ఎంపికై న జట్టు సభ్యులను వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏవీపాపారావు, స్పోర్ట్స్ డైరెక్టర్స్ డాక్టర్ కె.నాగరాజు, ఎం.ఎల్లారీశ్వరి అభినందించారు.

ఇండియా బుక్ఆఫ్ రికార్డ్స్‌కు చిన్నారి ఎంపిక



ఇండియా బుక్ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపికైన దుర్విత రామన్

పార్వతీపురంటౌన్: పట్టణంలోని జనశక్తి కాలనీకి చెందిన పెద్దింటి వెంకటరమణ, హైమవతిల రెండేళ్ల చిన్నారి దుర్విత రామన్ తన జ్ఞాపక శక్తితో అద్భుతమైన ప్రతిభను కనబరిచి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. బుడిబుడి అడుగులు వేస్తూ ముద్దుముద్దు మాటలు పలికే దుర్విత రామన్ రెండేళ్ల వయస్సులోనే 40దేశాల పేర్లు, రాష్ట్ర రాజధానులు, సౌర గ్రహాలు, రంగుల పేర్లు, ఆంగ్ల అక్షర మాల, 1 నుంచి 20 వరకు సంఖ్యలు, శరీరభాగాల పేర్లు, ఆల్ఫాబెట్ అన్ని చిత్రాలు, కూరగాయల పేర్లు, 32 పండ్ల పేర్లు, ఎక్కాలు, జాతీయచిహ్నాలు, మ్యాప్‌లో దేశాల పేర్లు, జంతువుల శబ్దాలు, రాష్ట్రాల పేర్లు అలవోకుగా చెబుతూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఆమెలోని ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు లిమ్కా బుక్ఆఫ్ రికార్డ్స్, గిన్నిస్ బుక్ఆఫ్ రికార్డ్స్', ఇండియా బుక్ఆఫ్ రికార్డ్స్' వారిని సంప్రదించారు. ఈ మేరకు ఇండియా బుక్స్ ఆఫ్ రికార్డ్స్ వారు చిన్నారిలోని ప్రతిభాపాటవాలను పరీక్షించి తమ పుస్తకంలో చోటు కల్పించారు. రెండేళ్ల ప్రాయంలోనే తమ చిన్నారికి ఇంతటి జ్ఞాపకశక్తి రావడం తమకు ఆశ్చర్యంగా ఉందని, మున్ముందు ఆమెను తమకు గల అవకాశాలతో బాగా చదివించి ప్రోత్సాహం కల్పించాలని భావిస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఏఈఓ మృతి

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో మంగళవారం ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యవసాయశాఖలో పనిచేస్తున్న ఏఈఓ గొర్లె సత్యనారాయణ (34) మృతిచెందారు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. స్థానిక మార్కెట్ యార్డులోని అగ్రిల్యాబ్‌లో సత్యనారాయణ విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే విధులు ముగించుకుని రాజాం నుంచి స్వగ్రామం వంగర మండలం ఎం.సీతారాంపురం ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. అమ్మవారి గుడిదాటిన తరువాత బొబ్బిలి రోడ్డులో వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

విద్య, వైజ్ఞానిక సదస్సులో ప్రతిభ


నిర్వాహకులతో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయురాలు

రాజాం సిటీ: శ్రీకాకుళంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న నిర్వహించిన సాంఘిక శాస్త్ర విద్య, వైజ్ఞానిక సదస్సులో రాజాం మున్సిపాల్టీ పరిధి బుచ్చెంపేట ఎంపీపీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మన సంస్కృతి-నాగరికత ఉట్టిపడేలా జానపద కళలు, నాటికలు, ఏకపాత్రాభినయం ప్రదర్శించారని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వడ్డి ఉషారాణి మంగళవారం తెలిపారు. ఈ ప్రదర్శనలకు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి లభించిందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రదర్శన పట్ల శ్రీకాకుళం డీఈఓ దేవానంద్‌రెడ్డి, కార్యక్రమ అధ్యక్షుడు కేశవరావులు హర్షం వ్యక్తం చేస్తూ నగదు బహుమతి, మెమెంటో, సర్టిఫికెట్లు అందించారని తెలిపారు.

జీఎంఆర్ ఐటీ విద్యార్థినుల 'పవర్'


ప్రతిభ కనబర్చిన విద్యార్థినులతో ఎడ్యుకేషన్ డైరెక్టర్ గిరీష్ తదితరులు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థినులు సౌత్ ఇండియా సబ్‌జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 22 వరకు గుంటూరు జిల్లా తెనాలి జేఎంజే ఉమెన్స్ కళాశాలలో ఈ పోటీలు జరిగాయన్నారు. 43 కేజీల విభాగంలో పి.బాలయక్షిత (జూనియర్) బంగారు పతకం, 52 కేజీల విభాగంలో ఎస్.కృష్ణవేణి (సబ్ జూనియర్) వెండి పతకం, 47 కేజీల విభాగంలో డి.సంధ్య, 105 కేజీల విభాగంలో చైతన్యలు జూనియర్ విభాగానికి సంబంధించి రజత పతకాలు సాధించారని తెలిపారు. వారి ప్రతిభపట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.